క్లుప్తంగా

## రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోను : ఎమ్మెల్యే



మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోనని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హెచ్చరించారు. శనివారం మిర్యాలగూడ మండల పరిధిలోని రైస్ మిల్లులను ఆయన సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లర్లతో మాట్లాడుతూ రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని కొనకుండా రోజుల తరబడి రోడ్లపై వేచి ఉంచి ఇబ్బందులు పెట్టడం సరికాదన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి సరైన ధర నిర్ణయించి న్యాయం చేయాలని మిల్లర్లను హెచ్చరించారు. ధాన్యానికి మద్దతు ధర కన్నా తక్కువగా ఇచ్చినా, రైతులను రోజుల తరబడి రోడ్లపై వేచి ఉంచినా ఆ రైస్ మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

## నేటి నుంచి శిరసనగండ్ల జాతరకు ప్రత్యేక బస్సులు

దేవరకొండ : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని నేటి నుంచి మూడు రోజుల పాటు శిరసనగండ్ల జాతరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు దేవరకొండ ఆర్టీసీ డిపో ఇన్‌చార్జ్ డీఎం డీఎం రామ్మోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూలు జిల్లా చారగొండ మండలం శిరసనగండ్ల జాతరకు ఈనెల 6,9,10వ తేదీల్లో ప్రత్యేక బస్సు సర్వీసులు నడుస్తాయని పేర్కొన్నారు. దేవరకొండ నుండి రూ.60, డిండి బస్ స్టేషన్ నుండి రూ.70 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ప్రయాణీకుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు.

## రావుల పెంటలో వైద్యశిబిరం

వేములపల్లి : మండలంలోని రావుల పెంట గ్రామంలో శనివారం మిర్యాలగూడ జ్యోతి ఆస్పత్రి వైద్యుడు ముప్పా రామారావు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం, గుండె, గ్యాస్ట్రో ఎంటాలజి క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు ముప్పా రామారావు మాట్లాడారు. ఈ సందర్భంగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఆదిల్‌బాషా, ముప్పా శ్రీహర్ష, ఎం.వెంకటేష్, జగదీష్‌చంద్రబోస్, ఆసీఫ్, ఖాజా, మాజీ ఎంపీటీసీ శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సన్నబియ్యం పంపిణీ



సన్న బియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్

చందంపేట : రేషన్ కార్డుదారులు సన్న బియ్యం సద్వినియోగం చేసుకోవాలని తిమ్మాపురం పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలంయాదవ్ అన్నారు. శనివారం మండలంలోని గాగిళ్లాపురం గ్రామంలో సన్న బియ్యం పంపిణి చేపట్టారు. ఈ కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, కృష్ణయ్య, ఆనంద్, యాదయ్య, సుజిత్‌కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలు వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

చందంపేట : వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి చందులాల్ సూచించారు. శనివారం మండలంలోని ముడుదండ్ల గ్రామంలో ఉపాధి పనులు చేపడుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలకు పలు సూచనలు చేశారు. వడదెబ్బబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆయన వెంట వైద్య సిబ్బంది సిబ్బంది శరత్, ఉపాధి కూలీలు తదితరులున్నారు.

# నీటి ఎద్దడి.. ప్రణాళికతో కట్టడి

- లీకేజీలు, మోటార్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి
- వేసవిలో నీటి కష్టాలను అధిగమించేందుకు చర్యలు
- జనాభాకు తగ్గట్టుగా నీటి సరఫరా



దేవరకొండ పట్టణంలోని వాటర్ ట్యాంకు పరిశీలిస్తున్న కమిషనర్, ఏఈ

దేవరకొండ : మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికార యంత్రాంగం ఇప్పటికే కసరత్తు చేపట్టింది. సక్రమంగా నీటి సరఫరా కోసం ఏఏ మరమ్మతులు అవసరమో గుర్తించాల్సిందిగా ఇటీవల ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. ఈ మేరకు దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి చర్యలు చేపట్టారు. పట్టణ జనాభాకు తగ్గట్టుగా ప్రజలకు తాగునీటిని అందించేందుకు సంబంధిత మున్సిపల్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పట్టణంలో తాగునీటి సమస్య ఉన్న కాలనీలు, మరమ్మతులకు గురైన బోర్లు, పట్టణానికి అవసరమైన తాగునీటి సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. దేవరకొండ మున్సిపాలిటీలో అధికారిక లెక్కల ప్రకారం దాదాపు 30వేల మంది ఉన్నప్పటికీ ప్రస్తుతం జనాభా 50వేల పై చిలుకు చేరినట్లు అంచనా. ఇందుకు గాను ప్రతి ఒక్కరికీ రోజు వారిగా 135లీటర్ల తాగునీటిని అందించాల్సి ఉంది. అందుకు తగ్గట్టుగా మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తున్నారు. మిషన్ భగీరథలో భాగంగా మొత్తం ఆరు ట్యాంకులు నిర్మించగా అందులో 4ఓహెచ్ఎస్ఆర్, 2 జీఎల్ఎస్ఆర్ ఉన్నాయి. వాటి నుండి తాగు నీటి సరఫరా నిమిత్తం పట్టణంలో మొత్తం 127 కిలోమీటర్ల మేర మిషన్ భగీరథ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు.

**తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు**

దేవరకొండ మున్సిపాల్టీలో జనాభాకు తగ్గట్టుగా తాగునీటిని అందించేందుకు అధికారులు మరమ్మతులకు గురైన బోర్లు, నీటి సరఫరాపై దృష్టి కేంద్రీకరించారు. ప్రస్తుత వేసవిలో పట్టణ జనాభాకు 5.2ఎంఎల్‌డీ నీరు అవసరం ఉండగా ప్రస్తుతం అవసరమైన నీరు కోదండాపురం నుంచి పట్టణానికి సరఫరా అవుతున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. పట్టణంలో 86 బోరు మోటార్లతో పాటు 25చేతిపంపులు కూడా పని చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి ఒక్క వాటర్ ట్యాంక్‌కు సంబంధించి ఇద్దరు లైన్‌మెన్లు ఎప్పుడూ నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంటున్నారు. అంతేగాకుండా తాగునీటి సరఫరాకి సంబంధించి ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి రోజు ఉదయం వాటర్ లైన్‌మెన్లతో సమీక్ష నిర్వహిస్తున్నారు అధికారులు. మొత్తానికి వేసవిలో ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు.

**ప్రణాళికలు సిద్ధం చేశాం**



దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే పట్టణ జనాభాకు తగ్గట్టుగా ప్రణాళికలు సిద్ధం చేశాం. మరమ్మతులకు గురైన బోరు మోటార్లు, చేతిపంపుల నిర్వహణ చేపట్టాం. ప్రతి నిత్యం వాటర్ లైన్‌మెన్లతో ససమీక్ష సైతం నిర్వహిస్తున్నాం. ఎక్కడైన సమస్యల ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి. వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులందరం అప్రమత్తంగా ఉన్నాం.

– రాజు, ఏఈ, దేవరకొండ మున్సిపాలిటీ

# ధాన్యం మొత్తం కొనుగోలు చేయాలి

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్



మిల్లర్లతో సమావేశం నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ : రైతులు తీసుకొచ్చిన మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కనీసం క్వింటాకు రూ.2300 ధర తగ్గకుండా కొనుగోలు చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ అన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో రైస్ మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. హెచ్ఎంటీ ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని, వెయింగ్ మిషన్లలో ధాన్యానికి వ్యత్యాసం రావద్దని, ప్రతి రైస్ మిల్లు కెపాసిటికి 50శాతంకు పైనే ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా మిల్లుల వారీగా టోకెన్లు, తేదీలను కేటాయించాలన్నారు. ప్రతి రైస్ మిల్లు కస్టం మిల్లింగ్ కోసం కెపాసిటీలో 50శాతం తప్పనిసరిగా ప్రతిరోజు ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. వేసవి దృష్ట్యా రైతులకు అసౌకర్యాలు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, సురేష్, సివిల్ సప్లయ్ డీటీ జావిద్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, రైస్ మిల్లర్లు గంటా సంతోష్‌రెడ్డి, వెంకటరమణచౌదరి, కుశలయ్య, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

## మిల్లుకు ధాన్యం తెచ్చిన రైతులకు అన్నదానం



రైతులకు అన్నం వడ్డిస్తున్న జయిని మురళి, తదితరులు

మిర్యాలగూడ : మండలంలోని సూర్య తేజ రా అండ్ బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీస్ ఎండీ జయిని మురళి ఆధ్వర్యంలో మిల్లుకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు 15రోజులుగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టించి పండించిన రైతులకు ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని తాగునీటి సౌకర్యంతోపాటు అన్నదాన కార్యక్రమం కూగా కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రతి సీజన్‌లో రైతులకు ఇబ్బంది కలుగకుండా పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆ దిశగా దేశానికి అన్నం పెట్టే రైతులను, పేదవారిని ఆదుకోవడంలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి రంగనాద్, పయిడిమర్రి సురేష్, జయిని ప్రకాశ్, సతీష్, శ్రీరాం , విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

## బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు



బాబుసాయిపేట రోడ్డులో ఓ రైస్ మిల్లు వద్ద బారులుదీరిన ధాన్యం ట్రాక్టర్లు

త్రిపురారం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. రైతులు ఎక్కువగా సన్న రకం ధాన్యాన్ని సాగు చేయడంతో అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పడంలేదు. రైతులు ధాన్యాన్ని మిల్లుల వద్దకు వచ్చిన తరువాత రోజు మొత్తం వేచి చూడాల్సి వస్తుంది. దళారులు చెప్పిన ధాన్యం మాత్రమే కొనుగోలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభ కాకపోవడంతోపాటుగా వాతావరణం మారుతుండడంతో రైతులు రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలిస్తున్నారు. దీంతో త్రిపురారం మండలంలోని బాబుసాయి పేట రోడ్డులో ఉన్న రంగా ఫుడ్ ప్రోడక్ట్ రైస్ మిల్లు ముందు దాన్యం టాక్టర్లు బారులుదీరాయి. అయితే ఇక్కడా దాన్యం ట్రాక్టర్లు నిలపడానికి సరైన స్థలం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ జామ్ వల్ల మూడు రోజుల కిందట ఓ ట్రాక్టర్ ఆటోను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడి పలువురికి తీవ్రంగా గాయాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. ధాన్యం ట్రాక్టర్లు ఇష్టమొచ్చినట్లు నిలపకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## శివాలయం అభివృద్ధికి రూ.60వేల విరాళం

హాలియా : పట్టణంలోని శ్రీ పార్వతీ సమేత జడల రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి స్థానిక డాక్టర్ ఎలికంటి రామచంద్రయ్య, విజయలక్ష్మి దంపతుల కుమారుడు బాలకృష్ణ, కోడలు శ్వేత, కూతురు ఎలికంటి గంగాభవాని, మనవళ్లు అద్వైక సాయి, దేవాన్ష్ సిద్ధార్థ, మనుమరాలు జైదేవర్షి రూ.60, 116 వేల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చెరుపల్లి ముత్యాలు దాత ఎలికంటి రామచంద్రయ్య, విజయలక్ష్మి దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ, వినోద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



హాలియా : దాత రామచంద్రయ్య, విజయలక్ష్మి దంపతులను సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

## తక్కువ పెట్రోల్ వచ్చిందని ఆందోళన



రెండు బాటిళ్లలో తేడాను చూపిస్తున్న బాధితుడు

పెద్దవూర : మండల కేంద్రంలోని వై-జంక్షన్‌లోని ఓ పెట్రోల్ బంక్‌లో తక్కువగా పెట్రోలు వస్తుందని శనివారం సాయంత్రం బాధితులు ఆందోళన చేశారు. వివరాల్లోకి వెళ్తే.. తుంగతుర్తి గ్రామానికి చెందిన దారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి బంక్‌కు వచ్చి రూ.220ల పెట్రోల్‌ను బాటిల్‌లో పోయించుకున్నాడు. పెట్రోల్ కొలతలో తేడావచ్చిందని గమనించి వెంటనే అక్కడికి వచ్చిన మరో వ్యక్తి దగ్గర ఉన్న బాటిల్‌ను తీసుకుని మరలా రూ.220ల పెట్రోలు పోయించాడు. రెండు బాటిళ్లలో పెట్రోల్ కొలతలో చాలా తేడా వచ్చింది. వెంటనే పెట్రోల్ పోసిన వ్యక్తిని వెంట తీసుకుని రెండు బాటిళ్లను తూకం వేయించగా 140 గ్రాముల తేడా వచ్చింది. దీంతో బాధితుడు శ్రీనివాస్‌రెడ్డి పెట్రోల్ బంక్ నిర్వాహకుడు, పెట్రోల్ పోసే వ్యక్తులతో తేడా ఎలా వచ్చిందని ప్రశ్నించగా ఎండాకాలంలో అలాగే తేడా వస్తది తాము ఏమి చేయలేమి నిర్లక్ష్యంగా మాట్లడినట్లు బాధితుడు పేర్కొన్నాడు. అప్పటికే పెట్రోల్, డీజిల్ పోయించుకోవడానికి వచ్చిన వినియోగదారులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ వీరబాబు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి నిర్వాహకుడు, బాధితుడితో మాట్లాడారు. సంబంధిత కొలతలు, తూనికల శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి బాటిల్‌లలోని పెట్రోల్‌ను దగ్గరుండి కొలతలు వేయించారు. రూ.220లకు 2.04 లీటర్లు రావాల్సి ఉండగా 1.770 మిల్లీ లీటర్ల పెట్రోల్ మాత్రమే వచ్చింది. 230 మిల్లీ లీటర్ల పెట్రోల్ తక్కువగా వచ్చింది. మరో బాటిల్‌లోని పెట్రోల్ సరిగానే ఉంది. దీంతో కొలతలు వేసిన విషయాన్ని సంబంధిత అధికారులకు తెలిపారు. తేడాలు రావడానికి గల కారణాలు సంబంధిత అధికారులు తనిఖీలు చేపడతారని ఆందోళన చెందొద్దని, బాధితులు, ప్రజలతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

వేములపల్లి : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన మండలంలోని శెట్టిపాలెం గ్రామం వద్ద శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందని రమావత్ లక్ష్మణ్ లీలా దంపతులు ఆటోలో వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం నుంచి అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీలో భాగంగా ఆటోను పరిశీలించగా అందులో సుమారు 4.5క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉండడంతో పట్టుకొని ఆటోను సీజ్ చేసి రమావత్ లక్ష్మణ్ లీలాపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## సబ్ కలెక్టర్‌కు సన్మానం



సబ్ కలెక్టర్‌ను సన్మానిస్తున్న యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగులు

మిర్యాలగూడ : యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లో భూ నిర్వాసితులైన 112 మందికి ఉద్యోగ నియామకపత్రాలను శుక్రవారం ప్రభుత్వం అందజేసింది. ఈ నేపథ్యంలో నివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను నియామకపత్రాలు అందుకున్న ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ కలెక్టర్ తీసుకున్న చొరవతో త్వరగా ఉద్యోగాలు వచ్చాయని పేర్కొన్నారు.

## శ్రీరామ నవమికి ఏర్పాట్లు

నాగార్జునసాగర్ : హిల్‌కాలనీలోని కెనాల్స్ ఆంజనేయస్వామి ఆలయంలో రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. శనివారం సీతాదేవిని పెళ్లికూతురిగా ముస్తాబు చేశారు. భద్రాచలంలో సీతారాముల కల్యాణం చేసే సమయంలోనే ఇక్కడ అదే తరహాలో కల్యాణం చేయనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు.

# బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి



దేవరకొండ : బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్, తదితరలు



మిర్యాలగూడ : జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



నిడమనూరులో..

భారత ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జున సాగర్ నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ పార్టీలు, దళిత, ప్రజా సంఘా ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. – సాక్షి, నెట్‌వర్క్



అడవిదేవులపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..



మిర్యాలగూడ టౌన్ : బీసీ సంఘాల ఆధ్వర్యంలో..



మిర్యాలగూడ : దామరచర్లలో



మిర్యాలగూడ అర్బన్ : సీపీఐ కార్యాలయంలో..



డిండి : ఎంపీడీఓ కార్యాలయంలో..



చింతపల్లి : వింజమూరులో..



నాగార్జునసాగర్‌లో..



మిర్యాలగూడ అర్బన్ : దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో..



పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి మండల కేంద్రంలో..



పెద్దఅడిశర్లపల్లిలో..



త్రిపురారం : ఎంపీడీఓ కార్యాలయంలో..



డిండి : యువజన సంఘాల ఆధ్వర్యంలో..



హాలియాలో..



పెద్దవూరలో..



కొండమల్లేపల్లి : కొల్‌ముంతలపహాడ్‌లో..



హాలియా : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..



దేవరకొండ : స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



మిర్యాలగూడ టౌన్ : తహసీల్దార్ కార్యాలయంలో..



మిర్యాలగూడ టౌన్ : మాదిగ దండోరా ఆధ్వర్యంలో..

# కొనసాగుతున్న కోలాటం పోటీలు



కోలాటం ఆడుతున్న మహిళలు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి మహిళా కోలాట పోటీలు నువ్వా.. నేనా అన్న రీతిలో రసవత్తరంగా కొనసాగుతున్నాయి. నిర్ణీత 40నిమిషాల సమయంలో వారివారి కళా ప్రదర్శనను చూపరులను ఆకట్టునే విధంగా కోలాటం ఆడుతున్నారు. తెలుగు రాష్ట్రాల స్థాయి పోటీలు కావడంతో జట్లు ఆయా ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో ఫ్లడ్ లైట్ల వెలుతురులో అర్ధరాత్రి వరకు ఈ పోటీలు కొనసాగాయి. ఈ ప్రాంతంలో ఎక్కడాలేని విధంగా మండల కేంద్రంలో మహిళా కోలాటాలు ప్రదర్శిస్తుండటంతో ఆయా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి వీక్షిస్తున్నారు.